# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### 3 గంటల కరెంట్‌తో నీళ్లు పారవు

**- లక్ష్మప్ప, రైతు, దుప్పటిగట్టు**



కాంగ్రెస్ రైతులను ఆగం చేయాలని చూస్తున్నది. వ్యవసాయానికి కాంగ్రెస్ పార్టీ 3 గంటల కరెంట్ ఇస్తే పంటలకు నీరందక ఎండిపోతాయి. తెలంగాణ రాకముందు కూడా ఆ పార్టీ ఇట్లానే చేసింది. అప్పుడు బావులకాడికి పంటలకు నీరు పెట్టేందుకు చిమ్మ చీకట్లో వెళ్లేటోళ్లం. లో కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. ఇప్పుడు మళ్లీ అదే తీరుగ ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలదు. 10 హెచ్‌పీ విద్యుత్ మోటర్లను కొనుగోలు చేయలేం. కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంట్ ఉన్నది. రైతులంతా మళ్లీ కాంగ్రెస్ రావొద్దని కోరుకుంటున్నాం.

### 24 గంటలు కరెంట్ ఉండాలి.. 3 గంటలు సరిపోదు

**- పెద్ద నర్సింహులు, మిట్టబాసుపల్లి, తాండూరు**



సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి. ఎవుసం తెలిసిన మనిషి. ఎవుసం తెలియనివారు కరెంట్ గురించి మాట్లాడడం విడ్డూరం. రైతుల కోసం సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెసోళ్లు చెప్పడం సిగ్గుచేటు. కాంగ్రెస్‌కు ఓటు వేయం. సీఎం కేసీఆర్‌కే మా రైతుల ఓటు. మరోసారి కేసీఆర్ సీఎం కావాలి. 50 ఏండ్లు ఏమీ చేయని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతుల కష్టాలు మరింత పెరుగుతాయి. రైతన్నలు ఆలోచించి ఓటు వేయాలి. ప్రజల కోసం పని చేసే రైతు సీఎం కావాలి. రైతు ప్రభుత్వం రావాలి.

### 'మూడు గంటల' పార్టీ వద్దు

**- ఈడిగి వెంకటయ్య, సాలార్‌నగర్, గండీడ్**



రైతులకు ఆదుకునే అనేక పథకాలను ప్రవేశపెట్టిండు సీఎం కేసీఆర్. రైతుల కోసం 24 గంటల విద్యుత్ ఇస్తుండు. దీంతో మూడు పంటలు పండిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మూడు గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తామని తెలియజేస్తున్నారు. మూడు గంటల కరెంటుతో వ్యవసాయం చేయలేం. ఇలాంటి పార్టీలు, ప్రభుత్వాలు మాకు వద్దు.

### కరెంట్ షాక్‌తో నా వేలు వంగిపోయింది

**- బుచ్చయ్య, రైతు, నారాయణపూర్, వికారాబాద్**



కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పుడు కరెంట్ వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియదు. కరెంట్ రాక కోసం పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. కరెంట్ రాగానే పంటకు నీరు పారబెట్టేందుకు అందరూ ఒకేసారి బోరు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు ఎగిరిపోయేవి. వాటిని సరి చేసే సమయానికి కరెంట్ పోయేది. ఫ్యూజులు సరి చేసే సమయంలో కరెంట్ షాక్ తగిలి నా ఎడమ చేతి వేలు వంగిపోయింది.

### రైతులకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

**- మందిపల్ వెంకట్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, కులకచర్ల**



రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు కరెంటును అందిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటలు మాత్రమే రైతులకు విద్యుత్‌ను ఇస్తామని అంటున్నది. రైతులకు అన్యాయం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నది. రైతులు ఈ విషయాన్ని గమనిస్తున్నారు. రైతులకు న్యాయం చేస్తేనే ప్రభుత్వాల మనుగడ సాగుతుంది. రైతులకు తండ్రిలా సీఎం అన్ని సంక్షేమ పథకాలు పెడుతున్నారు. 24 గంటల పాటు విద్యుత్‌ను అందించడంవల్ల నేడు గ్రామాల్లో మూడు పంటలు పుష్కలంగా పండిస్తున్నాం. రైతులకు అన్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకున్నట్లుంది. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుదాం.







## కాంగ్రెస్ వస్తే..

# దిన దిన గండమే

**3 గంటల కరెంట్‌తో ఎకరా కూడా పారదు**

**10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు అధిక భారం**

వికారాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తదా అని రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలు తప్పవని జిల్లా రైతాంగం అభిప్రాయపడుతున్నది. 10 హెచ్‌పీ మోటార్లతో 3 గంటల్లో మూడెకరాలు నీళ్లు పెట్టొచ్చన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 3 గంటల్లో ఓ మూలకు కూడా పారదని, మళ్లీ విద్యుత్తు షాక్‌లు, ఆత్మహత్యలు, అర్ధరాత్రి పొలాల్లో పడిగాపులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్నా సాగు చేసుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం రైతులు బోర్లు, బావులకు వినియోగిస్తున్న 5 హెచ్‌పీ మోటర్లకు బదులు 10 హెచ్‌పీ మోటర్లను వినియోగించినట్లయితే రైతులకు, ప్రభుత్వానికి అదనపు భారం కానున్నది. 10 హెచ్‌పీ మోటర్లను కొనుగోలు చేసేందుకు రైతులకు రూ.లక్ష వరకు భారం కానుండగా, 10 హెచ్‌పీ మోటర్లను రైతులు వినియోగిస్తే దానికనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచాల్సి ఉంటుంది. మూడు గంటల కరెంట్‌తో సాగులో ఉన్న భూములు కూడా బీడు భూములుగా మారే పరిస్థితులున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా, ప్రస్తుతం సాగులో భూములు 6 లక్షల విస్తీర్ణానికి పెరిగింది.

### రైతులంటే చిన్న చూపు

**- రంగారెడ్డి, నవాంద్గీ, బషీరాబాద్**



కాంగ్రెస్ నాయకులకు రైతులంటే చిన్న చూపు. అందుకే వ్యవసాయం విషయంలో ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. ఒక నాయకుడు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందంటే, మరో నాయకుడు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. వీళ్ల మాటలను బట్టి అర్థమవుతుంది రైతుల పట్ల వారికి ఉన్న నిజాయితీ. అధికారాన్ని వీళ్ల చేతిలో పెడితే రైతుల నోట్లో మట్టే.

### కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటాం

**- పెద్ద మల్కయ్య, గాదిర్యాల్, మహ్మదాబాద్**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మూడు గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తాననడం రైతులకు వ్యతిరేకమైన చర్య. రైతులకు వ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు మేము దూరంగా ఉంటాం. ప్రస్తుత ప్రభుత్వమే రైతులకు అన్ని విధాలుగా మేలు చేస్తున్నది. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ మూడు పంటలు పండించుకోవడానికి వీలు కల్పిస్తున్నది.

### మూడు గంటల కరెంట్‌తో పంటలు పండవు

**- వెంకట్‌రెడ్డి, నారాయణపూర్, వికారాబాద్**



రోజుకు మూడు గంటల కరెంట్ ఇస్తే బంధువుల వద్దకు, పండుగలకు దూరంగా పొలాల వద్దే కాలం గడపాల్సి వస్తుంది. నాలుగు ఎకరాలకు పంటలు సాగు చేయాలంటే 24 గంటల కరెంట్ ఉంటేనే బాగుంటుంది. కరెంట్ లేకపోతే పంటలు పండించడం కష్టతరమవుతుంది. 10 హెచ్‌పీ మోటర్లు కొనే స్తోమత లేదు. దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చవుతుంది. ఉన్న 3 హెచ్‌పీ మోటర్లతోనే పంటలు బాగా పండుతున్నాయి. 10 హెచ్‌పీ మోటర్‌తో ఒకేసారి నీరు పోస్తే భూగర్భజలాలు ఎండిపోయే ప్రమాదముంది.

### మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయానికి ముప్పుతిప్పలు

**- రాఘవేందర్‌రెడ్డి, రైతు, పెద్దేముల్**



సీఎం కేసీఆర్ పంటలు బాగా పండాలని 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను అందిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో కరెంట్ సరఫరా సరిగ్గా లేక రైతులు నానా ఇబ్బందులు పడేవారు. రాత్రి వేళల్లో పంటలకు సాగునీటిని పెట్టడానికి వెళ్లి పాము కాట్లకు, కరెంట్ షాక్‌లకు గురై ఎంతో మంది రైతులు ప్రాణాలను విడిచారు. ప్రతిపక్ష పార్టీల నాయకులకు అసలు వ్యవసాయానికి ఎంత కరెంట్ అవసరమో అస్సలు తెలియదు. 3 గంటల కరెంట్‌తో వ్యవసాయం సాధ్యమయ్యే పనికాదు.

### తేనె పూసిన మాటలను మేము నమ్మం

**- సుమంత్, అగ్గనూరు, యాలాల**



10 సంవత్సరాల నుంచి తెలంగాణ రైతులందరం సంతోషంగా ఉన్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో ప్రతి రైతు రెండు పంటలను పండిస్తున్నాడు. గతంలో కాంగ్రెస్ ఎన్నడు కూడా రైతుల గురించి ఆలోచించలేదు. రైతు, ఎద్దు ఏడ్చిన ఎవుసం ఎప్పటికీ వృద్ధిలోకి రాదు. రైతులకు 3 గంటల విద్యుత్ చాలని రేవంత్‌రెడ్డి అంటున్నాడు. అతడు ఓ రైతేనా? ఎప్పుడన్న వ్యవసాయం చేశాడా.. 10 హెచ్‌పీ మోటర్‌తో గంటకు ఎకరం పారుతుంది అనడం ఎంతవరకు సమంజసం. మోటర్‌కు డబ్బులెట్ల, నెలనెలా కరెంటు బిల్లు కాంగ్రెస్ ఇస్తుందా. కాంగ్రెస్ చేసే నీతిమాలిన రాజకీయాలు తెలియంది ఎవరికి. రైతన్నల ముఖంలో ఆనందం నింపిన సీఎం కేసీఆర్ వైపే మా రైతన్నలం ఉంటాం.

### మూడు గంటల కరెంటు సరిపోదు

**- పొట్ట వెంకటయ్య, రైతు, బొంరాస్‌పేట**



గత ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేశాయి. కరెంటు విషయంలో మేము పడ్డ కష్టాలు తలుచుకుంటేనే భయమేస్తున్నది. తెలంగాణ వచ్చిన తరువాత కరెంటు బాధలు తీరాయి. సీఎం కేసీఆర్ కృషితో వ్యవసాయానికి నిరంతరాయంగా కరెంటు సరఫరా జరిగి హాయిగా పంటలు పండించుకుంటున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇస్తామంటున్న మూడు గంటల కరెంటు వ్యవసాయానికి ఏమాత్రమూ సరిపోదు. పంటలు పండించుకోలేం. మాకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలి. కేసీఆర్ ఉంటేనే రైతులకు మేలు జరుగుతుంది.